క్లుప్తంగా

వారసంతలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

తిర్యాణి: మండల కేంద్రంలో నిర్వహించే వార సంతను ప్రైవేట్ వ్యక్తులతో కాకుండా పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించి, మౌలిక సదుపాయాలు కల్పించాలని బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ సార రమేశ్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రైవేట్ స్థలంలో సంత నిర్వహించడం ద్వారా గ్రామపంచాయతీ ఆదాయానికి గండి పడుతుందన్నారు. ప్రైవేట్ స్థలాన్ని గ్రామపంచాయతీ లీజుకు తీసుకొని సంత నిర్వహించడంతో పాటు మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు.

కౌటాలలో వర్షం

కౌటాల: మండలంలో శనివారం మధ్యాహ్నం మోస్తారు వర్షం కురిసింది. మండలంలో గత రెండు రోజులుగా వర్షాలు పడుతున్నాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్నం బాగా వర్షం కురవడంతో పత్తి విత్తనాలు వేస్తున్న రైతులు ఇళ్లకు తిరిగి వచ్చారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై గుంతల్లో వర్షపు నీరు నిలిచింది. పార్డి, సాండ్‌గాం, వీరవెల్లి గ్రామాలకు తారురోడ్డు సౌకర్యం లేక పోవడంతో మట్టి రోడ్డు బురదమయంగా మారింది. దీంతో గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

సోయాబీన్ కిట్స్ పంపిణీ

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని కచికంటి గ్రామంలో శనివారం పలువురు రైతులకు జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య డీఎస్‌బీ 21 రకం సోయాబీన్ 8 కిలోల మినీ కిట్స్‌ను పంపిణీ చేశారు. వర్షాలు కురిసిన తర్వాతనే రైతులు విత్తనాలు విత్తుకోవాలన్నారు. వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో శివకుమార్, మండల వ్యవసాయాధికారి అష్రఫ్, ఏఈవో నరేశ్, శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కేసీఆర్

బేల: సీఎం కేసీఆర్ ఉచిత హామీలతో ప్రజలను మోసం చేస్తున్నాడని కాంగ్రెస్ జిల్లా నాయకులు కంది శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. శనివారం మండలంలోని బెదోడ, కాంఘర్‌పూర్, మణియార్‌పూర్, దహెగాం గ్రామాల్లో పర్యటించారు. కాంగ్రెస్ అధికారంలో రాగానే ఏక కాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తుందన్నారు. అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్‌లు ఇద్దరు ఒకటేనని మండిపడ్డారు. భూ కబ్జాలు, అన్నిదందాలు కలిసే చేస్తారని ఆరోపించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, వాంఖడే వామన్, ఠాక్రే అశోక్, దేవ్‌శాళే విఠల్, బొక్రే శంకర్ పాల్గొన్నారు.

దేశం అభివృద్ధి పథంలో నడుస్తోంది

నేరడిగొండ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడుస్తోందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే మానాజీ అన్నారు. శనివారం మండలంలోని లింగట్ల, బందగూడ, కొరటికల్ పోలింగ్ బూత్‌లలో గడప గడపకూ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గడిచిన తొమ్మిదేళ్లలో దేశం సూపర్ పవర్‌గా ఎదిగిందన్నారు. రైతులకు అండగా ఉంటూ.. ఫసల్ బీమా యోజన పథకాన్ని తీసుకువస్తే రాష్ట్ర ప్రభుత్వం దాన్ని అమలు చేయకుండా రైతులకు నిండా ముంచిందన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి మాధవరావు ఆమ్టే, మండల అధ్యక్షుడు సోనయ్య హీరాసింగ్, సుభాష్, అనిల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

గుడిహత్నూర్: తెలంగాణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ అన్నారు. గడప గడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని మన్నూర్, కొల్హారి గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. గడిచిన 9 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి అవినీతికి తావులేకుండా అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. అవినీతి, కుటుంబపాలన నుంచి విముక్తి పొందేందుకు బీఆర్‌ఎస్‌ను ఓడించాలన్నారు. జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్, ఎంపీపీ భరత్, నాయకులు లక్ష్మణ్, భూమా పటేల్, జగన్, సుధాకర్, పరమేశ్వర్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొనాలి

ఆదిలాబాద్‌అర్బన్: రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను జిల్లా యువత సద్వినియోగం చేసుకోవాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్ గౌడ్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని పిట్టలవాడలో ఆన్‌లైన్ క్విజ్ పోటీల గురించి స్థానిక యువతకు వివరించారు. జూలై 2న జరగబోయే పోటీల్లో అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సెల్ కార్యదర్శి ఇలియాస్ ఖాన్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాహెర్ ఖాన్, భూపెల్లి శ్రీధర్ పాల్గొన్నారు.

సాగు సంబురం!



టోకెన్‌మోవాడ్‌లో సారలు కొడుతున్న రైతులు



బాబేఝరిలో విత్తనాలు విత్తుతున్న కూలీలు

- రోజూ వర్షం.. కర్షకుల హర్షం
- పొలం పనుల్లో అన్నదాత
- విత్తనాలు వేయడంలో నిమగ్నం

కెరమెరి: మండలంలో సాగు సంబురం ప్రారంభమైంది. మృగశిరలో వర్షాలు పడకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. కానీ ఆరుద్రలో వరుణుడు కరుణ చూపాడు. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జల్లులు కురుస్తుండడంతో రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు రైతులు పొలం పనుల్లో బిజీగా ఉంటున్నారు. ప్రతీ ఏడాది మృగశిరలో విత్తనాలు విత్తే రైతన్నలు ఈసారి మాత్రం వానలు అనుకూలంగా లేకపోవడంతో చాలామంది విత్తనాలు నాటలేదు. అయితే మృగశిరలో విత్తనాలు వేస్తే మంచిదనే భావనతో 30శాతం మంది రైతులు మట్టిలోనే విత్తనాలు వేశారు. అందులో కొన్ని మట్టిలోనే నిర్జీవమయ్యాయి. కాగా మళ్లీ ఇప్పుడు విత్తనాలు నాటుతున్నారు.

ఇప్పటికే 90శాతం సోయింగ్

గడిచిన మూడు రోజుల నుంచి వానలు ప్రతీరోజు కురుస్తుండడంతో కర్షకులు పత్తి, కంది విత్తనాలు నాటుతున్నారు. ఇప్పటికే 90శాతం సోయింగ్ పూర్తయినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మండలంలో మొత్తం 6423 మంది రైతులు ఉండగా 29,000 ఎకరాల్లో వివిధ రకాల పంటలు పండిస్తున్నారు. అందులో కేవలం పత్తి పంటను 22వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. కంది 5,400, పెసర 600, సోయా 150, మినుములు 150, జొన్న 200, కూరగాయలు 500 ఎకరాల్లో పండిస్తున్నారు.

పత్తికే డిమాండ్.

మండలంలోని రైతులు ఎక్కువగా వాణిజ్య పంటలపై మక్కువ చూపుతుంటారు. గతేడాది అనుకున్న స్థాయిలో పత్తికి ధరలు లేకున్నా రైతులు పత్తి సాగులో వెనక్కు తగ్గడం లేదు. గత ఏడాది పత్తికి ధర పెరుగుతుందని ఏప్రిల్ వరకు కూడా ఇళ్లల్లో పత్తి పంట నిల్వచేసుకున్నారు. ప్రభుత్వం పత్తి పంట ఎక్కువగా సాగు చేయకూడదని చెప్పినా మండలం రైతులు జిల్లాలోనే అత్యధికంగా సాగు చేశారు. ఇక ఈసారి గతేడాది కంటే ఎక్కువగా 2వేల ఎకరాలు సాగు చేస్తున్నారు. మండలంలోని డీలర్ల వద్ద యూరియా 2000 మెట్రిక్ టన్నులు, డీఏపీ 1250 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది.

యూరియా, డీఏపీ మిశ్రమం అవసరం



మండలంలో రైతులు ఇప్పటికే 90శాతం విత్తనాలు నాటారు. అయితే యూరియా, డీఏపీ కలిపి వేస్తే ఫలితం ఎక్కువగా ఉంటుంది. పత్తి విత్తడానికి వాతావరణం అనుకూలంగా ఉంది. మండలంలో ఎరువుల కొరత లేదు. బీటీవిత్తనాలను మాత్రమే నాటాలి. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే కొనుగోలు చేయాలి.

- ఎన్. గోపీకాంత్, ఏవో, కెరమెరి

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: మండలంలో 26వేల ఎకరాల్లో సాగు భూమి ఉంది. ప్రధానంగా 18వేల ఎకరాల్లో పత్తి పంట, 3 వేల ఎకరాల్లో వరి, మిగతా 5వేల ఎకరాల్లో కూరగాయలు, సోయా, ఇతర పంటలు సాగు చేయనున్నట్లు అధికారులు అంచనా వేశారు. పత్తి విత్తనాలు నాటడానికి వాతావరణం అనుకూలంగా మారడంతో విత్తనాలు నాటుతూ రైతులు పొలాల్లో బిజీగా కన్పించారు. వరి సాగు చేసే రైతులు నారుమళ్లను సిద్ధం చేసుకునే పనిలో పడ్డారు.

వ్యవసాయాధికారులు చేస్తున్న పలు సూచనలు

- జూలై 15వ తేదీ వరకు పత్తి విత్తనాలు నాటుకోవచ్చు.
- వరి సాగు చేసే రైతులు నారుమడులను సిద్ధం చేసుకోవచ్చు. జూలై నెలాఖరు వరకు వరి నాట్లు వేసేందుకు అవకాశం ఉందని రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని అధికారులు తెలియజేస్తున్నారు.
- పంట భూముల్లో సారం పెంచేందుకు కంపోస్ట్ ఎరువులు, పశువుల విసర్జితాలు, సహజ ఎరువులను మొదటి దఫాలో చల్లుకోవచ్చు. జీలుగ విత్తనాలను రెండున్నర ఎకరాలకు ఒక బస్తా చల్లుకోవాలి.
- పత్తి సాగు చేసే రైతులు ఎకరా భూమిలో ఒక బస్తా డీఏపీ, రెండు బస్తాల యూరియా, బస్తా పొటాష్‌ను వినియోగించాలని అధికారులు సూచిస్తున్నారు. అధిక మోతాదులో రసాయనిక ఎరువుల వల్ల ఎలాంటి లాభం ఉండదని రైతులు వ్యయాన్ని తగ్గించుకుంటే లాభాలు వస్తాయని అధికారులు సూచిస్తున్నారు.

సీఆర్‌టీల నియామకాలు పారదర్శకంగా చేపట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న సీఆర్‌టీల నియామకాలు పారదర్శకంగా చేపట్టాలని శనివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో డీటీడీవోకు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి మాట్లాడుతూ గతంలో విధులు నిర్వహించిన పార్ట్‌టైం సీఆర్‌టీలకు నియామకాల్లో ప్రాధాన్యతనివ్వాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందురావు, నాయకులు రమేశ్, ప్రీతి, మోహన్, హరీష్ తదితరులు ఉన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి



ప్రారంభించిన అంగన్‌వాడీ సెంటర్ వద్ద నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందించాలని జిల్లా పీడీ సావిత్రి అన్నారు. శనివారం మండలంలోని బానార్‌గొంది గ్రామంలో నూతన ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రాన్ని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావుతో కలిసి ప్రారంభించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలను పర్యవేక్షించి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుజాత, సర్పంచ్ గిరిజబాయి, నాయకులు పాల్గొన్నారు.

గుండి ప్రజలకు వంతెన కష్టాలు



తెగిపోయిన తాత్కాలిక వంతెన

ఆసిఫాబాద్‌రూరల్: గుండి ప్రజలకు వంతెన కష్టాలు మొదలయ్యాయి. మండలంలోని గుండి గ్రామం వద్ద వాగు దాటేందుకు వేసవికాలంలో తాత్కాలికంగా పైపులు వేసి మట్టి వేశారు. శనివారం కురిసిన వర్షానికి మట్టిరోడ్డు, పైపులు కొట్టుకుపోయాయి. దీంతో గుండి గ్రామానికి రాకపోకలు నిలిపోయాయి.

పదవీ విరమణ చేస్తున్న అధికారికి సన్మానం



జ్ఞాపిక అందజేస్తున్న లక్ష్మణరావు

రెబ్బెన: బెల్లంపల్లి రీజియన్ డీవైజీఎం (ఎఫ్అండ్ఏ)గా విధులు నిర్వహిస్తున్న ఎం. శరత్‌బాబు ఈనెలలో పదవీ విరమణ పొందనున్న సందర్భంగా శనివారం బెల్లంపల్లి ఏరియా పర్సనల్ డిపార్టుమెంట్ అధికారులు ఘనంగా సన్మానించారు. ఏరియా పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆయనకు పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో పర్సనల్ డిపార్టుమెంట్ సిబ్బంది శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో డీవైపీఎం తిరుపతి, డిపార్టుమెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

బేడీలతో ప్రగతిభవన్‌కు పాదయాత్ర



పాదయాత్ర ఫ్లెక్సీతో బాబురావు దంపతులు

ఆసిఫాబాద్: మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా రాజూరకు చెందిన బాబూరావు మాస్కే –శోభ దంపతులు జూలై 1నుంచి చేతులు, మెడకు బేడీలు వేసుకొని ప్రగతిభవన్‌కు పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రాజూర నుంచి పాదయాత్ర ప్రారంభిస్తామని, జూలై 15న హైదరాబాద్‌లోని ప్రగతిభవన్ చేరుకుంటామన్నారు. ఆగస్టు 1 నుంచి మహారాష్ట్రలోని 36 జిల్లాల్లో, 4000 కిలోమీటర్ల పాదయాత్ర చేపడుతామని, వచ్చే ఎన్నికల్లో మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ పార్టీ విజయం సాధించి, ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించే వరకు బేడీలు తీయబోమని, తమ సొంతింటికి కూడా వెళ్లబోమన్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

చెన్నూర్: ముదిరాజ్‌లను అసభ్య పదజాలంతో దూషించిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డిని బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేసి, శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని ముదిరాజ్ మహాసభ నాయకులు డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ చౌరస్తా వద్ద కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎమ్మెల్సీపై చర్యలు తీసుకోవాలని ఎస్సై చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ, నాయకులు నెన్నల సమ్మయ్య, నాయిని మదునయ్య, పాతర్ల నాగరాజు, జోడు శంకర్, తుమ్మ రమేశ్, చింతల శ్రీనివాస్, పిట్టల రాము, రవి, గండు రాజ్, సుంకరి సంతోష్, నాయిని సతీశ్, అట్టెం రాజబాపు, మద్ద మధు, బాలయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలి

నస్పూర్: ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని పదవి నుంచి బర్తరఫ్ చేయాలని తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కౌశిక్‌రెడ్డిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు ఏదునూరి రమేశ్, బింగి సుధాకర్, గోళ్ల సత్యనారాయణ, మంచర్ల సదానందం, తోకల వెంకటస్వామి, ఎనగందుల వెంకటేశ్, రాజు, సూరి, సాగర్, రాయమల్లు, మోహన్ పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ ప్రభుత్వానిది అబద్ధాల ప్రచారం'

బెల్లంపల్లి: తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అబద్ధాల ప్రచారం సాగించిందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కోడి రమేశ్ విమర్శించారు. పట్టణంలోని 26 వార్డులో శనివారం గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్, నాయకులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలి

చెన్నూర్‌రూరల్: మండలంలోని అస్నాద్ గ్రామంలో డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. శనివారం గ్రామానికి వచ్చిన ఆర్అండ్‌బీ ఈఈ పెద్దయ్యను కలిసి విన్నవించారు. గ్రామంలో డ్రెయినేజీలు నిర్మించి దాని ద్వారా ఇళ్లలోని మురుగునీరు చెరువులోకి మళ్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాప్రతినిధులు గ్రామస్తులు ఉన్నారు.

చెక్కులు మంజూరు చేయాలి

నేరడిగొండ: షాదీ ముబారక్ చెక్కులనరు త్వరగా మంజూరు చేయాలని లీడ్స్ వెల్ఫేర్ సొసైటీ నేరడిగొండ సభ్యులు ఎండీ సద్దాం అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆర్డీవో రమేశ్ రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఇప్పటికీ డబ్బులు అందలేదన్నారు. సాబీర్, షేక్ అర్షద్, మొహమ్మద్ అఖిల్, సయ్యద్ ఖైస్ పాల్గొన్నారు.

ఉపాధి గ్రామసభలు

సిరికొండ: మండలంలో జాతీయ ఉపాధిహామీ పథకం 2020–22 సంవత్సరాల ఆడిట్ గ్రామసభలను ఈనెల 27 నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. 27న లచ్చింపూర్ (బి), నారాయణ్‌పూర్, పోచంపల్లి, కన్నాపూర్ పొన్న, రాంపూర్, కుంటాగూడ, మాల్లాపూర్‌లో 28న వాయిపేట్, జెందగూడ, 30న ఫకీర్‌నాయక్ తండా, కొండాపూర్, నేరడిగొండ(జీ), ధర్మసాగర్, సోన్‌పెల్లి, రాయిగూడ, సుంకిడి, రిమ్మ పంచాయతీ కార్యాలయాల్లో నిర్వహిస్తామన్నారు.

వైద్య సేవలు అందేనా..?

- వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం
- ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజల వేడుకోలు



సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు



సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి

సిర్పూర్(టి): వానాకాలం ప్రారంభమైంది. జిల్లాలో అధికంగా ఏజెన్సీ గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు అధికంగా ఉండగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అధికారులు ఇంతవరకు ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టిన దాఖలాలు కన్పించడం లేదు. సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి, మండలంలోని ప్రజలతో పాటు నియోజకవర్గంలోని కౌటాల, బెజ్జూర్, చింతలమానెపల్లి మండలాల నుంచి అనేక మంది ప్రజలు ప్రతినిత్యం వైద్యసేవల కోసం వస్తుంటారు. అత్యవసర కేసులను సైతం 108 అంబులెన్స్ ద్వారా సిర్పూర్(టి) సామాజిక ఆసుపత్రికే తరలిస్తుంటారు. ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో అత్యవసర సమయాల్లో వచ్చిన రోగులకు సకాలంలో వైద్యం అందకపోవడం, మందులు అందుబాటులో లేకపోవడంతో ఇతర ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వానాకాలంలో సీజనల్ వ్యాధులతో ఇబ్బంది పడే రోగులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందుతాయా..? అన్న అనుమానం కలుగుతోంది.

మారుమూల గ్రామాలకు కలగానే..

మండలంలోని అనేక మారుమూల గ్రామాలకు కనీసం రోడ్డు వసతి కూడా లేదు. ఆయా గ్రామాల నుంచి సిర్పూర్(టి) ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యం అందడం కలగానే మిగులుతోంది. సిర్పూర్(టి) మండల కేంద్రంలో ప్రభుత్వ సామాజిక ఆసుపత్రితో పాటు మండలంలోని లోనవెల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, లక్ష్మీపూర్, చింతకుంట, హుడ్కిలిల్లో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. సీజనల్ వ్యాధుల కాలంలో మండలంలోని ఆసుపత్రుల్లో ఏటా రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని సామాజిక ఆసుపత్రిలో 30 పడకలు అందుబాటులో ఉన్నాయి. అయితే మామూలుగానే ఆసుపత్రిలో 150 నుంచి 200 వరకు ఉండే ఓపీ, సీజనల్ కాలంలో 250కి మించి ఉంటుంది. ఈ సమయంలో సరైన వైద్య సేవలు అందక మండలవాసులు తిప్పలు పడుతున్నారు. కనీసం ఈసారైనా రోగులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు రెగ్యులర్ మందులతో పాటు సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు, సరిపడా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మందులు అందుబాటులో ఉన్నాయి



లోనవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు హుడ్కిలి, చింతకుంట, లక్ష్మీపూర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల్లో మందులు, ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. మండలంలోని గ్రామాల్లో సేవలందించేందుకు ర్యాపిడ్ రెస్పాన్స్ టీం సిద్ధంగా ఉంది. టీం సభ్యులు మందులు, ఇంజక్షన్ల కిట్లతో గ్రామాలకు వెళ్లి వైద్యసేవలందిస్తారు.

- డాక్టర్ నవత, వైద్యాధికారి, లోనవెల్లి పీహెచ్‌సీ

గుడ్డ సంచుల పంపిణీ

శ్రీరాంపూర్: స్వచ్ఛత పక్వాడలో భాగంగా శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ అధికారులు, ఉద్యోగులు గుడ్డ సంచులు పంపిణీ చేశారు. ఓసీపీ ముంపు గ్రామమైన తాళ్లపల్లి గ్రామంలో ఓసీపీ మేనేజర్ సుధీర్ జక్కుల వార్‌తో వాటిని అందజేశారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పెన్నులు బిస్కెట్లు అందించారు. అంతకు ముందు ఓసీపీ వద్ద పరిసరాలను శుభ్రం చేశారు. గని పర్యావరణ అధికారి జలాలుద్దీన్, సంక్షేమ అధికారి బొంగుని శంకర్, సీనియర్ అండర్ మేనేజర్ వెంకన్న, మైనింగ్ సర్దార్ రాజేశ్వర్, ఫిట్ సెక్రెటరీ శంకర్ పాల్గొన్నారు.

పొంగిన వాగులు

భీమారం: రుతుపవనాల ఆగమనంతో మండలంలో శనివారం కురిసిన వర్షంతో వాగులు పొంగాయి. భీమారం సమీపంలోని అడవిగుండా వెళ్లే వాగులు వరదనీటితో పొంగి ప్రవహించాయి. మరోవైపు రైతులు పత్తి విత్తనాలను కూలీలతో నాటించే పనులు ముమ్మరం చేశారు.

సుర్జాపూర్‌లో గడపగడపకూ బీజేపీ

భీమిని: మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా కన్నెపల్లి మండలం సుర్జాపూర్‌లో శనివారం గడప గడపకూ బీజేపీ యాత్ర కొనసాగింది. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ ఇంటింటికీ వెళ్లి ప్రధాని మోదీ హయాంలో ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కన్నెపల్లి మండల అధ్యక్షుడు రామన్న యాదవ్, ప్రధాన కార్యదర్శి అన్నారపు ప్రశాంత్, జిల్లా కార్యదర్శి గోవర్ధన్, నాయకులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

ఆదిలాబాద్‌రూరల్: నేరస్తులు నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని ఆదిలాబాద్ రూరల్ సీఐ సైదారావ్ సూచించారు. శనివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో పాత నేరస్తులతో సమావేశం నిర్వహించారు.